క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీయుజ మాసం చతుర్దశి హస్త సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన నాయకులు



వైవీ సుబ్బారెడ్డిని కలిసిన పావులూరు వైఎస్సార్ సీపీ నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని మండలంలోని పావులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి పులఖండం రామకృష్ణారెడ్డి, పావులూరు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు సింహాద్రి బ్రహ్మారెడ్డి, పులఖండం జయరామిరెడ్డి, ముప్పవరపు శ్రీరాములు, మారెళ్ళ అజయ్‌రెడ్డి ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



చీరాల: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'చెడుపై మంచి', 'దుష్ట శక్తుల మీద దైవశక్తి' సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పర్వదినాన్ని జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. సుఖ సంతోషాలతో అందరూ పండుగ జరుపుకోవాలని నియోజకవర్గ ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

భీమవరంలో నేత్రదానం



దాత తోటకూర రంగారావు(ఫైల్)

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన తోటకూర రంగారావు(52) మరణించడంతో అతని నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు దాత నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులు, భార్య హేమలత, తల్లి రత్నకుమారి,బిడ్డలు మంజా,దత్త, సోదరులు మోహన్‌కృష్ణ, విజయభాస్కర్‌లను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు,జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిలు బలగం కోటేశ్వరరావు,అలవల రాఘవరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు, ఇతర సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 62 మంది లబ్ధిదారులకు రూ.55లక్షలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదివారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తోందన్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం వివిధ ప్రైవేటు హాస్పిటల్స్‌లో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రశీదులను సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం సీఎం సహాయనిధి నుంచి నగదు అందిస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ కొతరపు జనార్దన్, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వెలుగు దివ్వెల రంగేళి

- దీపావళి జరుపుకునేందుకు అంతా సిద్ధం
- ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాలు
- గతేడాది కంటే 15 శాతం పెరుగుదల



వేటపాలెంలో దీపావళి మతాబులు విక్రయ కేంద్రం

చీరాల/వేటపాలెం: కులమతాలకు అతీతంగా కుటుంబమంతా కలిసి దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది కంటే బాణాసంచా ధరలు ఆకాశాన్నంటాయి. చీరాల ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాలలో హోల్‌సేల్ షాపులున్నాయి. చీరాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో 33 షాపులు, జాంధ్రపేటలో 8, వేటపాలెంలో 6 షాపులకు అనుమతులిచ్చారు. వీటితో పాటు హోల్‌సేల్ షాపులు ఐదు ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ సంవత్సరం బాణసంచా సామగ్రి ధరలు 15శాతం మేర పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. శనివారం నుంచి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అలానే హోల్ సేల్ షాపుల వద్ద వారం రోజులు ముందుగానే కొనుగోలుదారులు బాణాసంచా కొనుగోలు చేస్తున్నారు. స్టాండర్డ్ కంపెనీ చిచ్చుబుడ్డి రూ.570, భూచక్రాలు రూ.320, కాకరకడ్డీలు రూ.35 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. రిటైల్ షాపుల కన్నా హోల్ సేల్ షాపుల వద్దకే ఎక్కువ మంది వెళుతున్నారు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలుదారుల సంఖ్య కూడా నామమాత్రంగా ఉంది. అయితే వర్షాల కారణంగా వ్యాపారాలు ఏలా ఉంటాయోనని వ్యాపారులు ఆందోళన పడుతున్నారు. బాణసంచా దుకాణాల వద్ద ఎటువంటి అగ్నిప్రమాదం జరగకుండా ముందస్తుగా అగ్నిమాపక సిబ్బంది ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. అగ్నిప్రమాదం జరిగితే అప్రమత్తమయ్యేందుకు అగ్ని నిరోధకాలను సిద్ధం చేసి ఉంచారు.

అధికారుల ముందస్తు తనిఖీలు..

దీపావళి పండుగ సందర్భంగా అగ్నిమాపక జిల్లా అధికారులు ముందస్తుగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి వినయ్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ చీరాల ప్రాంతంలోని పలు హోల్‌సేల్ బాణాసంచా దుకాణాలను తనిఖీలు చేశారు. జిల్లాలో 12 హోల్ సేల్ (365 రోజులు) అమ్మకాలు సాగించే షాపులు ఉన్నాయి. అలానే ఈ ఏడాది జిల్లాలో 135 తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. వీటిలో భద్రతా ప్రమాణాలు ఏ మేరకు పాటించారో అనేది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు సక్రమంగా పాటించారా అనేది పరిశీలన చేశారు. అగ్ని నిరోధకాలు, నీళ్ళ ట్యాంకులు, వాటర్ పైపులు పని తీరును పరిశీలించారు. వేటపాలెం మండలంలో అయితే ఇప్పటికే హోల్ సేల్ వ్యాపారుల వద్ద 90 శాతం సరుకు విక్రయాలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఈ ఏడాది ఇప్పటికి కేవలం 30 శాతం వ్యాపారం మాత్రమే జరిగిందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వేటపాలెం మండలంలో సరుకు కొనుగోలు కోసం రూ. 35 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది.



ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్ర ఔట్‌పోస్టు

బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి



సరైన జాగ్రత్తలు పాటిస్తే పండుగను సంతోషంగా జరుపుకోవచ్చు. బాణసంచా కాల్చే సమయంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. చెప్పులు ధరించాలి. కాలినవి, పేలని బాణసంచాను పట్టుకోవద్దు. బాణాసంచా కాల్చే సమయంలో నైలాన్, పాలిస్టర్ కాకుండా కాటన్ దుస్తులు ధరించాలి. ఆరుబయట పూరిల్లు, గడ్డివాములు లేని ప్రాంతాల్లో కాల్చాలి. ఏదైనా ప్రమాదం జరిగితే సమీపంలోని అగ్నిమాపక కేంద్రం నంబర్ 08594-232299ను సంప్రదించాలి.

– వీవీ రామకృష్ణ, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి

జాగ్రత్తలతో దీపావళి చేసుకోవాలి



తగిన జాగ్రత్తలు తీసుకుంటే దీపావళి పండుగ ఆనందాన్ని కుటుంబాలు ఆస్వాదించవచ్చు. మన ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండేలా పండగ నిర్వహించుకోవాలి. పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

– స్వాతికరణ్, వైద్యాధికారి, వేటపాలెం

వ్యాపారాలు డల్‌గా ఉన్నాయి

ఈ ఏడాది వ్యాపారాలు డల్‌గా ఉన్నాయి. గత ఏడాది ఇప్పటికే 70 శాతం పూర్తయింది. ప్రస్తుతం 30 శాతం వ్యాపారం జరిగింది. వర్షాల ప్రభావం విక్రాయాలపై పడింది. ప్రజల వద్ద డబ్బులు లేక పోవడం మరో కారణంగా కనిపిస్తోంది. ప్రతి సంవత్సరం ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. ఈ ఏడాది నష్టాలు వస్తాయని భయంగా ఉంది.

– సత్యనారాయణ, వేటపాలెం

వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ సూచించారు. ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గాంధీపార్కు సెంటర్, సావరపాలెం, 40 ఇండ్లకాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్ కాలనీ ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించారు.

పాఠశాలకు వెళ్లేదెలా?



చెరుకూరు పాఠశాల ఎదురు గుంతలమయమై నీటితో నిండిన రోడ్డు

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరు ఎంపీపీ పాఠశాల ఎదురు నిలిచిన వర్షపు నీటితో విద్యార్థులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఎదురు రోడ్డు గుంతల మయం కావడంతో కాస్తం వర్షం కురిస్తే చాలు నీరు నిలిచి పోతోంది. నీరు మట్టపు ప్రాంతాలకు వెళ్లే మార్గం లేకపోవడంతో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి దాంతో పాటు నీరు ఎక్కువ రోజులు నిలిచి ఉండటంతో మురుగు వాసన వెదజల్లుతోంది. సీజనల్ వ్యాధులు తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో పాఠశాల ఎదురు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు విద్యార్థులను పంపితే ఎటువంటి పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ వారు మురుగు నీటిని తొలగించి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించడంతో అసౌకర్యాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పథకాలున్నా ప్రయోజనం సున్నా!

- అలంకార ప్రాయంగా ఎత్తిపోతల పథకాలు
- సాగుకు నీరందక రైతుల ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- తుప్పుపడుతున్న యంత్రాలు
- ఆరువేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం



కొణిదెన ఎత్తిపోతల పథకం ఇలా..



చిల్లచెట్లతో నక్కబొక్కలపాడు ఎత్తిపోతల



మోటార్లు చోరీకి గురైన ఉప్పుమాగులూరు పథకం

బల్లికురవ: సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరందించేందుకు కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఎత్తి పోతల పథకాలు మరమ్మతులకు గురై అలంకార ప్రాయంగా మిగిలాయి. దీంతో రబీలో కూడా సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగలో ఉన్న మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు దొంగల పాలవుతున్నాయి.

ఐడీసీ ఆధ్వర్యంలో పథకాలు..

మండలంలోని గుంటుపల్లి, కొణిదెన, నక్కబొక్కలపాడు, ఉప్పమగులూరు గ్రామాలకు సమీపంలో వాగులపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాల ద్వారా ఆరువేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేశారు. ఈ పథకాలు ఐడీసీ ఆధీనంలో ఉన్నాయి. నక్కబొక్కలపాడు ఎత్తిపోతల పథకం రెండు దశాబ్దాల క్రితం రూ.7 కోట్లతో నల్లవాగుపై ఏర్పాటు చేశారు. తుదిదశపనుల్లో జాప్యం నెలకొనడంతో పని చేయడంలేదు. పథకం మూలన పడటంతో దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మలను పగలగొట్టి అందులోని విలువైన వైర్లను తస్కరించారు. ఇదే పథకానికి సమీపంలో కొణిదెన వద్ద ఏర్పాటు చేసిన పథకం సాంకేతిక మరమ్మతుల వల్ల పని చేయడం లేదు.

దొంగలపాలైన మోటార్లు..

ఉప్పమాగులూరు గ్రామ సమీపంలో ఓగేరు వాగుపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా పసుమర్రు మేజర్‌లోని సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు, వేమవరం, గోపాళంవారిపాలెం, గ్రామాలకు చెందిన 3 వేల ఎకరాలకు నీరందాల్సింది. అయితే పథకం ఉపయోగంలో లేకపోవడంతో గత ఏడాది విలువైన మోటార్లను దొంగిలించారు. పడమర వాగుపై గుంటుపల్లి మేజర్‌లోని 960 ఎకరాలకు నీరందించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకం విద్యుత్ లైన్‌లు మరమ్మతులకు గురవడంతో ఈ దుస్థితి నెలకొంది.



నల్లవాగులో నీటి ప్రవాహ ఉధృతి



పథకాన్ని వినియోగంలోకి తేవాలి

ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో ఓగేరు వాగుపై ఏర్పాటు చేసిన వేణుగోపాల స్వామి ఎత్తిపోతల పథకం పని చేయకపోవడంతో పసుమర్రు మేజర్‌లోని చివరి భూములకు నీరందటంలేదు. మోటార్లు అమర్చి తుది దశ పనులు పూర్తిచేసి పథకాన్ని పూర్తిచేసి పైర్లకు జీవం తేవాలి. – కొండవర్థి సాంబయ్య (సోమవరప్పాడు)



వాగులో నీరున్నా అందటంలేదు

పడమరవాగులో నీరు సమృద్ధిగా ఉన్నా గుంటుపల్లి ఎత్తిపోతల పథకం పని చేయడం లేదు. సాగర్ ఆయకట్టులో ఉన్న చివరి భూములు కావటంతో గుంటుపల్లి మేజర్‌లోని బల్లికురవ, నక్కబొక్కలపాడు పొలాలకు నీరందటంలేదు.

– పావులూరి ఆంజనేయులు (బల్లికురవ)

ప్రజా ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ



కోటి సంతకాల కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు

మేదరమెట్ల: ప్రజా ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలప్తి శ్రీధర్ అన్నారు. ఆదివారం కొరిశపాడు మండలం, మెదరమెట్ల గ్రామంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంలో భాగంగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కోటి సంతకాలు ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ కన్వీనర్ పాలపర్తి శ్రీధర్(చిట్టి) మెదరమెట్ల గ్రామ సర్పంచ్ బొనిగల ఏలేషమ్మ, పేరం నాగలక్ష్మి, స్టేట్ పబ్లిసిటీ వింగ్ కోయి అంకారావు, కర్నాటి వెంకట్రావు, గోనుగుంట్ల నరేంద్ర ధర్మరవపు, ప్రసాద్, యువజన విభాగం అధ్యక్షుడు నూకతోటి అశోక్ మండల జేసీయస్ కన్వీనర్ మామిళ్ళ పల్లి వేణు బాబు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



అద్దంకి క్రాకర్స్ షాపులను పరిశీలిస్తున్న సీఐ

అద్దంకి రూరల్: దీపావళి పండగను పురస్కరించుకుని క్రాకర్స్ అమ్మే షాపుల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి సీఐ సుబ్బరాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రకాశం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపులను పరిశీలించారు. ప్రతి షాపు ముందు నీటి రమ్ములు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా ఆకతాయిలను షాపుల వద్ద మందులు కాల్చనీయవద్దన్నారు. జాగ్రతలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు.



ఆదివారం సముద్ర తీరాన..



చీరాల వాడరేవులో పర్యాటకులతో ఆహ్లాదంగా ఉన్న తీరం

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు తీరంలో ఆదివారం సందడి నెలకొంది. సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. వాడరేవు తీరానికి చీరాల, పర్చూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో వాడరేవు నిండిపోయింది. చీరాల వాడరేవుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి ఆనందరంగా తీరంలో గడపడంతో వాడరేవులో సందడి నెలకొంది. రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్, సివిల్, ఏఆర్, మెరైన్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. తీరంలో భక్తులు లోతుకు వెళ్లకుండా చర్యలు చేపట్టడంతో పాటు గజ ఈతగాళ్లతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామితో పాటు రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

యువత సన్మార్గంలో నడవాలి



దేవుని వాక్య సందేశాన్నందిస్తున్న పాస్టర్ రాజా హేబెల్

చీరాల రూరల్: యువతీ యువకులు చెడునడతలు విడనాడి ఆధ్యాత్మికంగా సన్మార్గంలో నడవాలని రాజా ఫెయిత్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు పాస్టర్ రాజా హేబెల్ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో సెయింట్ మార్క్స్ యూత్‌లీగ్ ఆధ్వర్యంలో యువజనుల ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్ పిల్లి దేవదాసు, నానిబాబు, కిరణ్‌పాల్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాస్టర్ రాజా హేబెల్ పాల్గొని దేవుని వాక్య సందేశం అందించారు. తాను సినిమాల్లో హీరోగా నటించే సమయంలో ఎంతో కోపంతో ఉండేవాడినని, అనేక మందిని బాధలకు గురిచేశానని, తాను కూడా అనేక బాధలు అనుభవించానని సాక్ష్యం చెప్పారు. తాను ఎప్పుడయితే క్రీస్తును నమ్మి ఆయట బాటలో నడిచానో అప్పటి నుంచి ఎంతగానో దీవించబడ్డానని చెప్పారు. యూత్ సభ్యులు దేవుని గీతాలను ఆలపించారు. చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com